

ఆదర్శనీయులు వాల్మీకి మహర్షి : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

భారతీయ ఇతిహాసాన్ని, మానవ సంబంధాలు, కుటుంబ విలువల సారాంశాన్ని అపురూపమైన రామాయణ గ్రంథంగా సమాజానికి అందించిన 'వాల్మీకి మహర్షి' భావితరాలకు ఆదర్శనీయమని డిఆర్ఒ ఎం.విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉన్న పిజిఆర్ఎస్ హాలులో జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ పూలమాలలు వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి(పరిపాలన) కె. ప్రకాష్ బాబు, ఎ.ఆర్ అదనపు ఎస్‌పి బి. రమణయ్య, ఎఆర్ డిఎస్‌పి నాగేశ్వరావు, ఆర్ఐలు శివరాముడు, టైటాస్, శ్రీశైల రెడ్డి, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై

మతోన్మాదుల దాడి గర్హనీయం



కడపలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సనాతన ధర్మానికి అవమానం పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై మతోన్మాద అడ్వకేట్ కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరటం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతుందని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు జి.చంద్రశేఖర్, జి.చంద్ర విమర్శించారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ఇప్పటివరకు ధ్వంసం చేస్తూ వచ్చారని తెలిపారు. ఇప్పుడు బహిరంగంగా సనాతనధర్మ పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే చెప్పు విసరటం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానమని చెప్పారు. సనాతన ధర్మమంటే ఇదేనా అన్న అంశంపై ప్రధానమంత్రి మోడీ స్పందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలే సనాతన ధర్మం అసలు రూపాన్ని బయటికి తెస్తుందని పేర్కొన్నారు. కేవలం దళితుల నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన గవాయ్ లాంటి వారిని చూసి సహించలేక చేసిన అగ్రకుల మతోన్మాద చర్యను ఖండిస్తున్నామని తెలిపారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా సనాతన ధర్మ వాదుల్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, నగర కార్యదర్శి రామ మోహన్, కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, నగర కార్యదర్శి విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి, పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ, భాగ్యలక్ష్మి, వామపక్ష నాయకుడు రమణయ్య పాల్గొన్నారు. **కడప :** దేశ అత్యున్నత న్యాయస్థానం ముఖ్య న్యాయ అధికారి జస్టిస్ బి.ఆర్. గవాయ్ పై రాకేష్ అనే న్యాయవాది దాడికి యత్నించిన ఘోర ఉదంతంలో నిజమైన సూత్రధారులు ఎవరన్నది నిగ్గు తేల్చాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ డిమాండ్ చేశారు. అత్యంత అమానవీయమైన ఈ ఘటన భారతదేశ న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా విమ ర్శించారు. **బద్వేలు :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రామకృష్ణ గవాయిపై బూటుతో అడ్వకేట్ కిషోర్ దాడి చేయడం దుర్మార్గమని అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జకరయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి చాంద్‌బాషా డిమాండ్ చేశారు. పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్రజా సంఘాలు దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. **బ్రహ్మంగారిమఠం :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై రాకేష్ కిషోర్ న్యాయవాది కోర్టులో అందరి సమక్షంలో భూటు తో దాడి చేయటాన్ని ప్రజాస్వామిక వాదులు మానవతా వాదులందరు ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.శివకుమార్ తెలిపారు. మంగళవారం బ్రహ్మంగారిమఠంలోని అంబేద్కర్ విగ్రహం ముందు సిపిఎం, ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిని ఖండిస్తూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. **అట్లూరు :** సుప్రీంకోర్టు సిజె బి.ఆర్. గవాయ్‌పై దాడి చేసిన అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని సిపిఎం ఆధ్వర్యంలో అట్లూరు క్రాస్ రోడ్డులో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తిపై అడ్వకేట్ చెప్పు విసిరి దాడి చేయడం హేయనీయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సిపిఎం అట్లూరు మండల కార్యదర్శి ఇ.రమణయ్య, సిపిఎం నాయకులు స్వప్న, లత, రవిచంద్ర, గోపయ్య, పెంచలయ్య పాల్గొన్నారు **ప్రొద్దుటూరు :** సర్వోన్నత న్యాయమూర్తిని అవమానించడం దేశ న్యాయ వ్యవస్థను అవమానించినట్టే అని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా మంగళవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అత్యున్నత న్యాయవ్యవస్థలోని ఈ దుర్మార్గ కరచర్య అత్యంత అవమానకరమని తెలిపారు. **జమ్మలమడుగు :** సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై మతోన్మాద అడ్వకేట్ కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరటం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతుందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. **వేంపల్లె :** దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్టులో సాక్షాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయిపై సనాతన ధర్మం పేరుతో న్యాయవాది బూటుతో దాడి చేయడం అత్యంత దుర్మార్గమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు.



బి.మఠంలో ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు



బద్వేల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : జెవివి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2025 చెకుముకి సైన్స్ సంబరాలు 8, 9, 10 తరగతుల విద్యార్థుల కోసం తెలుగు, ఇంగ్లీషు భాషల్లో నిర్వహించనున్నారు. చెకుముకి పరీక్షలు అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సంబరాలకు సంబంధించిన కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విద్యార్థి కాలంతో పోల్చి, ఈ పరీక్షలు విద్యార్థుల్లో పోటీ భావన పెంపొందించడంతో పాటుగా శాస్త్రీయ అవగాహనను వెలుగులోకి తీసుకు వస్తాయని పేర్కొన్నారు. జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయి శ్రీ మాట్లాడుతూ టెక్నాలజీ విస్తరణ కాలంలో ఇలాంటి పరీక్షలు విద్యార్థులకు ఉత్తేజాన్ని ఇస్తాయని చెప్పారు. బిసి కార్పొరేషన్ ఆఫీసర్ డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పరీక్షలు ప్రభుత్వ అనుమతితో అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో నిర్వహిస్తారన్నారు. జెవివి నాయకులు మాట్లాడుతూ ఈ నెల 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12, 13, 14న రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు https://jvvap.org, 97053 33305, gsjvap@gmail.comలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రాజశేఖర్ రాహుల్, సృజన్ కుమార్, వెంకట రామరాజు, సరస్వతి, శివరాం, షామీర్ బాష, నరసింహారెడ్డి, రవి పాల్గొన్నారు.

సీమ వైభవాన్ని ఆవిష్కరించే విశిష్ట గ్రంథం

ప్రజాశక్తి- కడప అర్బన్ : మహోజ్వలమైన రాయలసీమ వెయ్యేళ్ల తెలుగు సాహిత్య వైభవాన్ని చాటి చెప్పడానికి 'వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం - రాయలసీమ భాగస్వామ్యం' అనే పేరుతో త్వరలో ఒక విశిష్టమైన గ్రంథాన్ని ఆవిష్కరించబోతున్నట్లు వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా రచయితల సంఘం వారి ఆధ్వర్యంలో ఈ పుస్తక ప్రచురణ ఉంటుందన్నారు.

12న పెన్షనర్ల సమస్యపై జిల్లా సదస్సు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉదయం 10 గంటలకు కడప బాలాజీ నగర్ యుటిఎఫ్ హాల్‌లో 'పెన్షన్ వ్యవస్థ సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడి' అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించనున్నామని నాయకులు కోరారు. మంగళవారం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇపిఎఫ్, పెన్షనర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం పెన్షన్ బిక్ష కాదు, ఒక హక్కు అని గతంలో తేల్చి చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి దయ దక్షిణాలకొద్దీ పెన్షన్ ఇస్తున్నట్లు భావించడం సరికాదన్నారు. సదస్సుకు పెన్షనర్స్ అసోసియేషన్ అఖిలభారత కో-ఆర్డినేషన్ నాయకులు ఎం.జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు హాజరవుతున్నట్లు తెలిపారు. అన్ని రంగాల పెన్షనర్లు, ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సదస్సు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రామ్మూర్తి నాయుడు, కళ్యా సుధాకర్, సాంబశివారెడ్డి, చంద్రమౌళి పాల్గొన్నారు.

వాలంటీర్ల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కడప అర్బన్ : నేషనల్ యూత్ వాలంటీర్లు ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేరా యువ భారత్ జిల్లా యువ అధికారి ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక సంవత్సరం పాటు సమాజసేవ నిమిత్తం 2025, అక్టోబర్ 1 నాటికి 18-29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, ఆసక్తి గల యువతి యువకులు ' నేషనల్ యూత్ వాలంటరీ' లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చదువుతూ ఉన్నవారు, ఉద్యోగం చేస్తున్న వారు అనర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వాలంటరీలకు నెలకు రూ.5000 స్టయిఫండ్ చెల్లించాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా కడప జిల్లా వాసులై ఉండాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9908127829లో సంప్రదించాలని తెలిపారు.



మాట్లాడుతున్న పఠాన్ మన్సూర్ అలీఖాన్

మహిళల పట్ల అపార గౌరవం

ప్రజాశక్తి - కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ మహిళల పట్ల అపార గౌరవం కలిగి ఉంటుందని ఆ పార్టీ నగర అధ్యక్షులు పఠాన్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నేతల గత చరిత్రను ఒకసారి పరిశీలిస్తే వారు మహిళల పట్ల అనుసరించిన వైఖరి ఏమిటన్నది తెలుస్తుందన్నారు. కడప నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజా జీవితంలో ఉన్న మాధవిని అగౌరపరుస్తూ సోషల్ మీడియా వేదికగా దేశ ప్రజలు చూసేలా వ్యవహారించిన వ్యక్తి పారిపోయే పరిస్థితుల్లోనే పోలీసులు అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారన్నారు. తొలినుంచి వైసిపి మహిళలకు తగిన గౌరవ మర్యాదలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎవరు ఎంత స్థాయిలో ఉన్నా ఆడవారిని కించపరిస్తే తక్షణ చర్యలు ఉంటాయన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి గురించి మాట్లాడేముందు గత చరిత్ర తెలుసుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ సుబ్బారెడ్డి, అధికార ప్రతినిధి డాక్టర్ జిలాని బాష, పలువురు అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-కడప : జిఎస్‌టిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. 'సూపర్ జిఎస్‌టి.. సూపర్‌సేవింగ్స్‌పై మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన ధరలు, 4 వారాల షెడ్యూల్‌ను సవివరంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంటింటికి వెళ్లి జిఎస్‌టి తగ్గింపు, సేవింగ్స్ వల్ల వివరించాలని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్, గృహోపకరణాలు కంపెనీల అసోసియేషన్‌ల వారితో మైదుకూరు, కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించి ప్రదర్శన ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈనెల 10, 11 తేదీల్లో కడప కళాక్షేత్ర ప్రాంగణంలో ఎలక్ట్రానిక్, గృహోపకరణాల ప్రదర్శన, సేల్స్ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెసి అదితి సింగ్, జిఎస్‌టి జాయింట్ కమిషనర్, నోడల్ అధికారి జి. సుమతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : పోస్టల్ శాఖ పథకాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని సూప రింటెండెంట్ రాజేష్ అన్నారు. మంగళవారం అత్యుత్తమ పోస్టల్ లైఫ్ ఇన్సూ రెన్స్ కస్టమర్ అనూషకు పిఎల్ఐ బాండ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ 1854లో ప్రారంభించారని తెలిపారు. దేశంలోనే అత్యంత పాత బీమా పథకమని చెప్పారు. తక్కువ ప్రీమియం అధిక బోనస్ కలిగిన విశ్వసనీయత బీమా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు విజయ భాస్కర్ రెడ్డి, ఎ. విజయ భాస్కర్, పిఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్, సిబ్బంది పి.వి. సునీత, వీర శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



బాండ్లు అందజేస్తున్న సూపరింటెండెంట్

భద్రతా నిబంధనలు పాటించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

బాణసంచా గోడౌన్ల నిర్వాహకులు ఫైర్, భద్రతా నిబంధనలు (సేఫ్టీ మెజర్స్) కచ్చితంగా పాటించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ రూమ్ హాలులో దీపావళి పండుగ నేపథ్యంలో బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు, తదితర అంశాలపై ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్‌లతో కలసి ఆర్‌డిఒలు, కమిషనర్లు, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ డివిజన్‌లలో బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇస్తారన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, అన్ని రకాల భద్రత చర్యలను తప్పక పాటిస్తూ సంప్రదాయ పండుగను సంతోషంగా నిర్వహించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. కమ్యూనిటీ ఓపెన్ ఏరియాలలో క్రాకర్స్ వినియోగించేలా చూడాలని చెప్పారు. పాఠశాలల్లో పిల్లలకు టపాసుల వినియోగం, భద్రతపై అవగాహన పెంచాలన్నారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖలు ఎప్పటికప్పుడూ అలర్ట్‌గా ఉండాలన్నారు. మర్షియల్ టాక్స్ అధికారులు అన్ని డివిజన్‌లలోని ఆర్‌డిఒ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. మండల అధికారులతో సమావేశం నిర్వహించి భద్రత ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లైసెన్స్ పర్మిషన్లు తదితర అంశాలపై సడన్ విసిట్లు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ ఒక్క బాణసంచా దుకాణం నిర్వహించకూడదన్నారు. నిబంధనలను ఉల్లంఘించే షాపులను సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కడప, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, చంద్ర మోహన్, సాయిశ్రీ, చెన్నయ్య జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ సాయి ధర్మా రావు, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్, మున్సిపల్ కమిషనర్లు, ఫైర్, రెవెన్యూ, పోలీసు, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

ఒంటిమిట్టలో పౌర్ణమి సందర్భంగా శ్రీ కోదండరాముడి శ్రీ సీతారాముల కల్యాణం మంగళ వారం వైభవంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారి కల్యా ణోత్సవాన్ని తిలకించారు. ఇందులో భాగంగా భగవత్ విజ్ఞాపనం, సభ అనుజ్ఞ, లోకకల్యాణం కోసం సంకల్పం చేయించారు. ముందుగా పుణ్యాహవచనం నిర్వహించారు. ఆ తరువాత రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ, వరప్రేశనం (కన్యావరణం), మధువర్కార్చనం చేశారు. మహాసంకల్పం అనంతరం కన్యాదానం చేసి సీతారా మచంద్రుల ప్రవరలను చదివారు. రాములవారి వంశస్వరూపాన్ని స్తుతించారు. అగ్నిప్రతిష్టాపన తరువాత సీతా రాముల తల మీద జీలకర్ర, బెల్లం ఉంచి శాస్త్రోకంగా కల్యాణ వేడుక నిర్వహించారు. స్వామి నివేదన, వేదస్వస్తి, మహదాశీర్వచనంతో కల్యాణఘట్టం పూర్తయింది. అంతకుముందు ఉదయం శ్రీ సీతాలక్ష్మణ సమేత ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంలతో స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టిటిడి సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎ. నవీన్‌కుమార్, అర్చకులు, విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై విచారణ చేపట్టాలి : ఎంపీ

ప్రజాశక్తి- కడపఅర్బన్ : నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వంపై విచారణ చేపట్టాలని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్‌పి విశ్వనాథ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మొలకల చెరువు నుంచి గ్రేటర్ రాయలసీమకు నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారని తెలిపారు. కృష్ణ జిల్లా నుంచి కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర వరకు నకిలీ మద్యం అక్రమంగా రవాణా అవుతుందని చెప్పారు. ఆధారాలతో అడ్డంగా దొరికిన కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదని విమర్శించారు. ఇటువంటి ప్రభుత్వానికా ఓట్లు వేసి గెలిపించమా అని ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి కల్తీ మద్యంపై విచారణకు ఆదేశించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - వల్లూరు : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ బైపిసి రెండో సంవత్సరం చదువుతున్న అనూష అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ నాజీ మునిషా అన్నారు. మంగళవారం మైదుకూరులోని మేధా డిఫెన్స్ అకాడమీలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్ -19 అథ్లెటిక్స్ పోటీల్లో అనూష హై జంప్‌లో మొదటి స్థానం సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థిని అరాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు, తమకు చాలా గర్వంగా ఉందని పేర్కొన్నారు. అనూషను పాఠశాల పీడీ, కళాశాల సిబ్బంది అభినందించారు.

అభాగ్యురాలికి ఆశ్రయం

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని వరికుంట్ల యానాది కాలనీలో అడవి మీద ఆధారపడి జీవించే లక్ష్మమ్మ వృద్ధురాలికి వివేకానంద సేవాశ్రమం ఆశ్రయం కల్పించింది ఆమెకు దిక్కుమొక్కు ఎవరూ లేరు. భర్త చనిపోయాడు. బంధువులు కూడా లేకపోవడంతో తినడానికి, ఉండటానికి చాలా అవస్థలు పడేది. ఈ విషయాన్ని కాలనీవాసులు వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డికి సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన ఓబుళాపురం గ్రామం సమీపంలో సగిలేరు నది ఒడ్డున ఉన్న తమ సేవాశ్రమానికి వాహనంలో తీసుకెళ్ళి ఆశ్రయం కల్పించి అండగా నిలిచారు. ఏ ఆదరణ లేని అభాగ్యులకు తమ సేవాశ్రమం ద్వారా ఉచితంగానే ఆశ్రయం కల్పించి అన్ని సేవలు అందిస్తామని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు మండలంలోని రాజకీయ నాయకులు మేధావులు పెద్దమనుషులు రామకృష్ణారెడ్డిని అభినందిస్తున్నారు సేవ చేయడం అంటే చాలా కష్టంతో కూడిన పని ఆయనకు ఉన్న సహనం సేవ ఓర్పు చాలా గొప్పదని వారన్నారు.

కాలిబాటలతో అధిక ప్రయోజనాలు

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె

వరి పంటలో కాలిబాటలతో అధిక ప్రయోజనం ఉంటుందని కెవికె సమన్వయకర్త డాక్టర్ అంకయ్య కుమార్, మేకపాటి గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాలలో నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ అవగాహన కోసం మంగళవారం ఇప్పపెంటను సందర్శించారు. వారు గ్రామంలో నాలుగు నెలల పాటు ఉండి క్షేత్ర స్థాయిలో రైతులు ఆచరిస్తున్న పద్ధతులపై నిశితంగా పరిశీలిస్తారు. ఇందులో భాగంగా విద్యార్థులు వరి పంటలో కాలిబాటలతో కలిగే ప్రయోజనాలపై విధాన ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త పాల్గొని వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమన్వయకర్త అంకయ్య కుమార్, శాస్త్రవేత్తలు వి.శిల్పకళా, ఐ.సురేష్ కుమార్ రెడ్డి, మహేష్ బాబు ఇప్పపెంట గ్రామ రైతులు పాల్గొన్నారు.



కాలిబాటలపై అవగాహన కల్పిస్తున్న కెవికె సమన్వయకర్త



మాట్లాడుతున్న జిజిహెచ్ ప్రిన్సిపల్ డాక్టర్ జమున

మానసిక రుగ్మతల పట్ల అవగాహన అవసరం

- జిజిహెచ్ ప్రిన్సిపల్ డాక్టర్ జమున

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మానసిక రుగ్మతల పట్ల అవగాహన అవసరమని జిజిహెచ్ ప్రిన్సిపల్ డాక్టర్ జమున పేర్కొన్నారు. మంగళవారం జిజిహెచ్ ఆవరణంలోని సైక్రియాటిక్ సూపరింటెండెంట్ వెంకటరాముడు అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై సైక్రియాటిక్ ఆవరణంలో మానసిక వైద్య నిపుణులు వేసిన థీరియాటికల్ ముగ్గుల పోటీలను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ మానసిక రుగ్మతల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని ప్రొద్దుటూరు వంటి ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న మానసిక రోగుల కారణంగా నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు భయానకంగా ఉంటున్నాయన్నారు. మానసిక రోగులకు సత్వరమే చికిత్స అందించాల్సి ఉందన్నారు. మానసిక వైద్యనిపుణులు, సిబ్బంది గీసిన థీరియాటికల్ ముగ్గుల చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. చిత్రలేఖన పోటీలు, ర్యాలీ ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వైద్య నిపుణులతో కలిసి థీరియాటికల్ ముగ్గుల పోటీలను తిలకించడంతోపాటు ముగ్గుల ప్రత్యేకతలను అడిగితెలుసుకున్నారు. సైక్రియాటిక్ సూపరింటెండెంట్ వెంకటరాముడు మాట్లాడుతూ గతేడాది స్పాన్సర్ సహాయంతో రూ.65 వేల వ్యయంతో కూడిన అవగాహనా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ ఏడాది స్పాన్సర్ లభించని పరిస్థితుల నేపథ్యంలో సైక్రియాట్రిక్ వైద్యనిపుణుల వ్యక్తిగత సహాయం ఆధారంగా శుక్రవారం కడపలోని కోటిరెడ్డిసర్కిల్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు ర్యాలీ ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సైక్రియాటిక్ విభాగానికి చెందిన డాక్టర్లు వంశీ, విష్ణు, సునీత, సరిత, సాహిద్, సురేష్, సందీప్, రవికిరణ్, నగేష్, విశాల సహా పలువురు వైద్యనిపుణులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక వారోత్సవాలకు నిధుల కొరత

- రూ.50 వేల కేటాయింపునకు తిరస్కృతి

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలకు నిధుల దెబ్బ తగిలింది. జిజిహెచ్‌లోని సైక్రియాటిక్ విభాగంలో ఈ నెల ఆరు నుంచి పదవ తేదీ వరకు థీరియాటికల్ ముగ్గుల పోటీల నుంచి పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. చివరి రోజున ఈనెల 10న కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి మహవీర్ సర్కిల్ వరకు నిర్వహించే భారీ ర్యాలీ, ప్రదర్శనలకు సుమారు రూ.50 వేల నుంచి రూ.65 వేల వరకు ఖర్చులు అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సైక్రియాటిక్ సూపరింటెండెంట్ ఆర్.వెంకటరాముడు జిజిహెచ్ ప్రిన్సిపల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి ప్రిన్సిపల్ సానుకూలంగా స్పందించి జిజిహెచ్ ఎడిని సంప్రదించాలని సూచించారు. జిజిహెచ్ ఎడిని సంప్రదించగా నిధుల విడుదలకు ససేమిరా అన్నట్లు విశ్వసనీయ సమాచారం. జిజిహెచ్‌లో సుమారు రూ.ఏడు కోట్లపై నిధులు మురిగిపోతున్నట్లు తెలుస్తోంది. ప్రజోపయోగ కార్యక్రమాలకు నిధులు సద్వినియోగం చేయకపోవడంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది.

అంకాల శైలజను అభినందించిన ప్రిన్సిపల్

ప్రజాశక్తి - కడప



శైలజను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్న అంకాల శైలజను కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ మంగళవారం అభినం దించారు. కడపలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ విద్యార్థిని అంకాల శైలజ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్‌తోపాటు ఓపెన్ యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ బయ్యపురెడ్డి ఆమెకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు టెండర్లు నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప అమీన్‌పీర్ దర్గా ఉరుసు మహోత్సవానికి సంబంధించి పనులను వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టే విధంగా టెండర్లు నిర్వహించాలని మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్.దస్తగిరి, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ ఇబ్రహీం పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీధర్, డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు, మున్సిపల్ కమిషనర్‌కు మైనార్టీ రైట్స్ ఫోరం ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుకే అధికార హక్కు ఉందని కాబట్టి వక్ఫ్ బోర్డు ఆదాయాన్ని పెంపొందించాలని కోరారు. గతంలో స్థానిక మున్సిపల్ పరిధిలో నిర్వహించిన టెండర్లతో పోల్చితే ప్రస్తుతం బహిరంగ టెండర్ల ద్వారా కనీసం పది రెట్లు అధిక ఆదాయం సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. ఈ ఆదాయాన్ని వక్ఫ్ బోర్డు నిరుపేద ముస్లిం సమాజ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించవచ్చు అన్నారు. కడప అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా) వక్ఫ్ ప్రాపర్టీ కింద నమోదు చేయబడిదని కాబట్టి వక్ఫ్ ప్రాపర్టీపై పూర్తి హక్కు వక్ఫ్ బోర్డుకే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ రైట్స్ ఫోరం సభ్యులు మహమ్మద్ మున్నా, పఠాన్ సలీం, ఖదీర్, ఖయ్యూమ్ తో పాటు ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.



ఫుట్ బోర్డుపై అష్టకష్టాలు పడుతున్న ప్రయాణికులు

సరిపడ బస్సుల్లేక అవస్థలు

- ప్రమాదకరంగా ఫుట్ బోర్డుపై ప్రయాణం

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో వారి ప్రయాణాలు ఎక్కువయ్యాయి. బస్సులు తక్కువ. ప్రయాణికులు ఎక్కువ కావడంతో అందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, రోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాడిపత్రి నుంచి వచ్చే బస్సు ముద్దనూరు మీదుగా ప్రొద్దుటూరు వెళ్లే వస్తుంటుంది. బస్సు లోపల ప్రయాణికులు ఎక్కువ కావడంతో లోపలికి వెళ్లేందుకు వీల్లేక పురుషులు, మహిళలు ఫుట్ బోర్డుపై నిలబడి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ కాసేపు బస్సు నిలిపినా ఫుట్‌బోర్డుపై ప్రయాణికులు దిగకపోవడంతో చేసేదేమీ లేక అలాగే వెళ్లాల్సిన పరిస్థితి. చూసే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇది నిత్య కృత్యంగా ఉంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్‌టిసి అధికారులు సరిపడ బస్సులు నడపాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

వ్యర్థాలను పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్ డిమాండ్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

యురేనియం ప్రాజెక్టు వ్యర్థాలను పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, పులివెందుల నాయకులు గఫూర్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. వేముల మండలంలోని యురేనియం కర్మాగారం వ్యర్థాల వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనేక దుర్ఘటనలు, బాధలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెయిలింగ్ పాండ్‌లో వ్యర్థాలు పెరిగి ప్రజల ఆరోగ్యం పాలవుతున్నారని, ఈ ప్రభావం సాగు భూములపై పడుతోందని తెలిపారు. వ్యర్థ పదార్థాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కలుషితమయ్యాయని తెలిపారు. టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచితే ఆ ప్రభావం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందన్నారు. యురేనియం యాజ మాన్యం, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. నష్టాలు, ప్రజల బాధలు చెప్పడానికి అవకాశాల్లేకుండా రకరకాల పేర్లతో పనిచేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ప్రజలను ఇబ్బంది పెడితే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

ప్రతి శుక్ర, శనివారాల్లో ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు రోటరీ కంటి ఆసుపత్రిలో ప్రతి శుక్ర, శనివారాల్లో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధ్యక్షులు కోటా శివకుమార్, కార్యదర్శి ఎంవిఎస్ ప్రభు తెలిపారు. అంతర్జాతీయ సామాజిక సేవా సంస్థ రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కంటి ఆసుపత్రిలో అధునాతన ఆపరేషన్ థియేటర్లో కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 20 మంది సిబ్బంది, అనుభవజ్ఞులైన ఇద్దరు ఫ్యాకో సర్జన్స్ సేవల ద్వారా షుగర్ వ్యాధిగ్రస్తులకు, 60 ఏళ్ల పైబడిన వారికి మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేవా భావంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు సమాచారానికి 08564 247012 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రామచంద్ర పట్ల పోలీసుల తీరు గర్హనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

బిసివై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ పట్ల పోలీసుల తీరు గర్హనీయమని ఆ పార్టీ పులివెందుల ఇన్‌ఛార్జి సురే నిర్మల యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆమె మాట్లాడుతూ రాజయ్యపేట రైతులకు మద్దతుగా వెళుతున్న రామచంద్ర యాదవ్‌ను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. రైతులకు మద్దతు ఇవ్వడం నేరమా అని ప్రశ్నించారు. డ్రగ్స్ కంపెనీకి కూటమి ప్రభుత్వం రైతుల భూములను కట్టబెట్టాలని ప్రయత్నిస్తుంటే, అందుకు నిరాకరించిన రైతుల పోరాటానికి మద్దతు ఇచ్చేందుకు వెళుతున్నారని తెలిపారు. రామచంద్ర యాదవ్ ఉద్యమ స్ఫూర్తిని చూసి కూటమి ప్రభుత్వం భయపడుతున్నట్లు తెలిపారు. రైతు వ్యతిరేక చర్యలను చేపట్టరాదని కూటమి ప్రభుత్వానికి సూచించారు. రైతులకు అన్యాయం చేసే పనులు చేస్తే కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేర్లతో సహా పేకలిస్తారన్నారు. ఓవరాక్షన్ చేస్తున్న పోలీసులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - లింగాల

మండలంలోని పలు గ్రామాల్లో బుధ వారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుం దని ఆ శాఖ అధికారి రమేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నకుడాల సబ్‌స్టేషన్ పరిధిలో పనులు జరుగుతున్నందున ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కర్నపాపయ్యపల్లె ఫీడర్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

కక్షలు వీడుదాం.. ప్రశాంత జీవితం గడుపుదాం : ఎస్ఐ

ప్రజాశక్తి - వేముల

కక్షలు వీడి ప్రశాంత జీవితం గడుపుదామని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఎస్‌పి నచికేత్ విశ్వనాథన్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి చింతల జూటూరు గ్రామంలో పోలీసులు మేలుకొలుపు అనే నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దేశాభివృద్ధికి పల్లె గ్రామాలు పట్టుగొమ్మలాంటివని తెలిపారు. అలాంటి గ్రామాలలో కక్షలు వీడి ప్రశాంత జీవనం కొనసాగించినప్పుడే జీవితానికి ఒక అర్థం ఉంటుందని వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ వాటిపట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్లు చేసి ఒటిపి చెప్పండి అని అడిగితే చెప్పొద్దన్నారు. యువత బెట్టింగ్, ఆన్‌లైన్‌ల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇలాంటి వ్యసనాలకులోనై ఆస్తు లను, అప్పులను పోగొట్టు కోవడమే కాకుండా సమాజంలో పరువు కూడా పోతుందని తెలి పారు. చదువుకు విలువ ఇస్తూ సమాజంలో ఉన్నత స్థాయికి వెళ్లాలని సూచించారు. సమా జంలో జరుగుతున్న పరిణా మాలను మేల్కొలుపు నాటిక ద్వారా అవగాహన కల్పించారు.

కొనుగోలు కేంద్రం లేక.. నష్టానికి అమ్ముకోలేక

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గంలో మొక్కజొన్న సాగు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. మొక్కజొన్నకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించినా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులకు ప్రయోజనం చేకూరడం లేదు. బయట వ్యాపారస్తులు సిండికేటుగా ఏర్పడి ఒక ధరను నిర్ణయించుకొని కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. తమకు గత్యంతరలేక పంటలు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చెన్నముక్కపల్లె, కొత్తపేట, కొత్త నెల్లూరు గ్రామాలతోపాటు దువ్వూరు మండలంలో అత్యధిక గ్రామాలు మొక్కజొన్నను సాగు చేస్తుంటారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతుల కోరుతున్నారు.



రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న విత్తనాలు

ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల వల్లే రోడ్లు జలమయం



నీటిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీలో అధికారుల అతి జాగ్రత్త వల్లే రెండు రోజులుగా మైదుకూరు పొట్టి శ్రీరాములు సర్కిల్ మొత్తం నీళ్లతో నిండ పోయిందని సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలో సోమవారం మధ్యాహ్నం నుండి వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి నుంచి కూరగాయల మార్కెట్, పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు మోకాలి లోతు వర్షపు నీరు, మురుగు నీటితో రోడ్లన్నీ నిండిపోయాయని తెలిపారు. ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో మంగళవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎర్రచెరువు, నీరునిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పొట్టి శ్రీరాములు సర్కిల్ దగ్గర నీటిలో నిలబడి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ నీటిపారుదల అధికారులు, మున్సిపల్ అధికారుల అతి జాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగానే రెండు రోజులుగా మున్సిపాలిటీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అక్టోబర్‌లో వర్షాలు వస్తాయని తెలిసి కూడా ఎర్ర చెరువును పూర్తిగా నింపడం సరికాదన్నారు. ఆదివారం కురిసిన భారీ వర్షంతో ఎగువ ప్రాంతాల నుండి వచ్చిన నీరు ఎర్రచెరువులో కలిసి పట్ట ణంలోని రోడ్లను ముంచెత్తాయన్నారు. వర్షపు నీరు వెళ్లడానికి సరైన కాలువలు లేకపోవడం, ఉన్న కాలువలు ఆక్రమణకు గురి కావడంతో పెద్ద మొత్తంలో నీరు రోడ్లమీదికి వచ్చిందన్నారు. రైతులు, వాహనదారులు, సాధారణ ప్రజలు, చిరు వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందాల్సిన మైదుకూరు ఇలా వర్షం వచ్చిన ప్రతిసారి చెరువులను తలపిస్తుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని సకాలంలో ఆక్రమణదారుల మీద చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాలువలలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గురయ్య, నాయకులు జహంగీర్ బాషా, హుస్సేన్, శివ పాల్గొన్నారు.

మద్దతు ధరతో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిని కోరారు. ఆ మేరకు మంగళవారం మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వరికి ప్రభుత్వ మద్దతు ధర రూ.2,369 ఉండగా దళారులు 81కిలోల వరి ధాన్యం బస్తా కేవలం రూ.1,340 కొనుగోలు చేస్తున్నట్లు కలరెక్టర్ దృష్టికి తెచ్చారు. దళారులను కట్టిడి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలిరెడ్డిపల్లి, తూపల్లె, ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె, కుమ్మరాంపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయ్ ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో చింతలమడుగుపల్లె సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఆదర్శ రైతులు వెంకట నారాయణ రెడ్డి, శంకరయ్య, గంగాధర్ పాల్గొన్నారు.




కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణారెడ్డి, రైతులు

ఆర్థిక ప్రణాళికలు ముఖ్యం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం మంగళవారం వాణిజ్యశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఆర్‌బిఐ ట్రైనింగ్ అండ్ కౌన్సిలర్ పి.ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా విద్యార్థులకు, అధ్యాపకులకు ఆర్థిక అవగాహన కల్పించారు. జీవితం సుస్థిరంగా అభివృద్ధి చెందాలంటే ఆర్థిక ప్రణాళికలు చాలా ముఖ్యమన్నారు. ప్రతి వ్యక్తి ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని సూచించారు. బ్యాంకులు అందించే వివిధ రకాల పెట్టుబడి అవకాశాలు, సేవింగ్స్ పథకాలు, సైబర్ భద్రత, ఫైనాన్షియల్ ఫ్రాడ్స్ నివారణపై విలువైన సూచనలు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు చెన్నరాయుడు, శ్రీనివాసులు, శివకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్‌కుమార్



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఉల్లి రైతుల కష్టాలు పట్టని ప్రభుత్వం

- మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

ఉల్లి రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘు రామిరెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు మండలంలోని కృష్ణాపురం, అక్కులాయిపల్లి, తిప్పిరెడ్డిపల్లెలో ఉల్లి పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1,200 కొనుగోలు చేస్తామని ప్రకటించి పట్టించుకోకపోవడం బాధా కరమన్నారు. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టి క్వింటా రూ.400 అమ్మితే రైతు పరిస్థితి ఏమిటన్నారు. రెండున్నర ఎకరాకు రూ.50 వేలు ఇస్తామని చెప్పి ఆ ఊసే లేదన్నారు. మైదుకూరు ఉల్లికి ప్రసిద్ధిగాంచిన ప్రాంతమన్నారు. నియోజకవర్గంలోని వేలాది ఎకరాలలో ఉల్లి సాగు చేశారన్నారు. ఉల్లి రైతుల గోడు ఈ ప్రభుత్వంలో వర్ణణాతీతమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్నారు. ఉల్లి, వరి, అరటి, టమోటా, చీనీ పంటల ఏ ఒక్క రైతు కూడా కూటమి ప్రభుత్వంలో సంతోషంగా లేడన్నారు. ఉల్లి పంట పరిశీలనా కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ హార్టికల్చర్ శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మైదుకూరు ఉప మండల అధ్యక్షులు రఘురామిరెడ్డి, వైసిపి నాయకులు లింగన్న, రాఘవరెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, షరీఫ్, సివి సుబ్బారెడ్డి, వైసిపి కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రేపు ఉప్పలూరులో మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ముద్దనూరు

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న ఉప్పలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రధానో పాధ్యాయులు రఘురాం యాదవ్ తెలిపారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9న అథ్లెటిక్స్ పోటీలు, 10న వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాట్‌మెంటన్, చెస్, యోగా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. క్రీడల్లో పాల్గొనేందుకు అండర్-14,17 బాల, బాలికలు అర్హుల న్నారు. పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు మాత్రమే పాల్గొనాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గ్రామ పెద్దల సహకారంతో మధ్యాహ్నం భోజనం వసతి ఏర్పాటు చేసినట్లు ప్రధానో పాధ్యాయులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆప్ పులివెందుల ఇన్‌ఛార్జిగా రహమతుల్లా

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గం ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ఇన్‌ఛార్జిగా వేంపల్లెకు చెందిన రహమతుల్లాను నియమిస్తూ ఎపి ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఆప్ జాతీయ నాయకుడు మణి నాయుడు ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు ఇన్ ఛార్జిలను నియమించినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట చలపతి పేర్కొ న్నారు. మంగళవారం ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు నియామక పత్రాలను వెంకట చలపతి అందజేశారు. కడపకు సాజిద్ హుసేన్, ప్రొద్దు టూరుకు ఫీజా దస్తగిరి, కమలాపురానికి మహబూబ్ షరీఫ్‌ను నియమిం చినట్లు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నిక లకు కూడా సంసిద్ధం అవుతున్నట్లు చెప్పారు. పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటి గడపకూ వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ దాదాపీర్, ఆప్ నాయకులు పీరుబాషా, గౌస్ పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకుంటున్న ఇన్‌ఛార్జులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి

లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గోకులం షెడ్ల మంజూరైన లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి సి.భూపేష్ సుబ్బ రామిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని అంబవరం గ్రామంలో గోకులంషెడ్ నిర్మాణానికి మంగళవారం వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంతోపాటు పశు పోషణలో భాగంగా గోకులం షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. రెండవసారి కొత్త వాటి నిర్మాణానికి అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎపిడి, ఎపిఒ పద్మారాణి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జున, గ్రామ నాయకులు అంబవరం రామయ్య, సర్పంచ్, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు కృషి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి రామాయణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేతోపాటు వాల్మీకులకు అండగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వాల్మీకులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది, భూపేష్‌రెడ్డి

ఆదికవి వాల్మీకి ఆరాధ్యనీయుడు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆదికవి వాల్మీకి, జగద్గురు ఆదిశంకరాచార్య గొప్ప కవులు, తత్వవేత్తలు, ఆరాధ్యనీయులని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో వాల్మీకి, ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు తులసిరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి గొప్ప రుషి, మహర్షి, తత్వవేత్త, కవి అన్నారు. సంస్కృత భాషలో ఏడు ఖండాలు, 24 వేల శ్లోకాలతో ఆది కావ్యమైన సంస్కృత రామాయణాన్ని ప్రపంచానికి అందించిన వ్యక్తి వాల్మీకి అన్నారు. ఆదర్శ మానవుడు, పరిపూర్ణ మానవుడు ఎలా ఉండాలి అని ప్రపంచానికి తన ఆది కావ్యం ద్వారా చాటి చెప్పిన గొప్ప సంఘసంస్కర్త, ప్రబోధకుడు అని కొనియాడారు. శంకరాచార్యులు గొప్పతత్వవేత్త, కవి, అద్వైత సిద్ధాంత ప్రబోధకుడన్నారు. శివానందలహరి, లక్ష్మీ నరసింహ స్తోత్రం , భజగోవిందం ఆయన రచించిన ముఖ్య రచనలుగా వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వేంపల్లె మండలశాఖ అధ్యక్షులు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఎన్.అలివేలమ్మ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, బద్రీనాథ్, బండారు వెంకటేశు, బ్యాంకు శ్రీనివాసులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి